క్లుప్తంగా

నేడు మండల సర్వసభ్య సమావేశం

ఊట్కూరు: మండల పరిషత్ భవనంలో ఎంపీపీ ఎల్కోటి లక్ష్మినారాయణరెడ్డి అధ్యక్షతన సోమవారం మండల సమావేశం నిర్వహిస్తున్నట్లు మంగళవారం ఎంపీడీఓ ధనుంజయగౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి ముఖ్య అతిథులుగా హాజరవుతున్నారని ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు హాజరు కావాలని కోరారు.

మరికల్‌లో..
మండలంలోని ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం మండల సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ పావని ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11గంటలకు ప్రారంభమయ్యే సమావేశానికి మండల అధికారులు తమ నివేదికలతో హాజరు కావాలని సూచించారు.

అభివృద్ధిపై దృష్టి..



ఆత్మకూర్: మున్సిపాలిటీల్లో అభివృద్ధిపై దృష్టి సారించడంతో పాటు అందరిని భాగస్వామ్యం చేయాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి చైర్‌పర్సన్ గాయత్రి, పురపాలిక మండలి సభ్యులకు సూచించారు. కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన ఆదర్శ సురభిని ఆత్మకూర్ మున్సిపల్ పాలకమండలి సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువ, పుష్పగుచ్ఛంతో సత్కరించారు. ఈసందర్భంగా పలు అభివృద్ధి కార్యక్రమాల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు మహేశ్వరి, తబస్సుం, చెన్నయ్య, మండ్ల రామకృష్ణ తదితరులు ఉన్నారు.

పంచాయతీ భవనం పనులు పూర్తిచేయాలి

మరికల్: మండలంలోని మాధవరంలో అర్ధంతరంగా నిలిచిపోయిన పంచాయతీ భవనం పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు యాదయ్య, వెంకటయ్య, నర్సింహులు మంగళవారం సంయుక్త ప్రకటనలో అన్నారు. గత ప్రభుత్వం పంచాయతీ భవనాలకు నిధులు మంజూరు చేసిందని, మిగితా గ్రామాల్లో నూతన పంచాయతీ భవనాలు పూర్తి చేసి ప్రారంభించారని, మాధవరంలో ఎందుకు పనులు నిలిపివేశారని వారు ప్రశ్నించారు. వెంటనే భవనం పనులు పూర్తి చేసి ప్రారంభించాలని వారు డిమాండ్ చేశారు.

విద్యార్థులకు కరాటే తరగతులు



మాగనూర్: మండల పరిధిలోని నేరడగం శ్రీ సిద్ధలింగేశ్వర మఠం పాఠశాలలో విద్యార్థులకు కరాటే తరగతులను ప్రారంభించారు. ఈ మేరకు.. పాఠశాల మేనేజ్‌మెంట్ శ్రీ పంచమ సిద్ధలింగేశ్వర మహాస్వాములు మాట్లాడుతూ.. విద్యార్థులకు చదువు ఒకటే కాకుండా కరాటే వంటివి నేర్పించడంతో భవిష్యత్‌లో వారు ఎలాంటి సమస్యలనైనా ఎదుర్కొనే ధైర్య సాహసాలు లభిస్తాయన్నారు. కార్యక్రమంలో కరాటే మాస్టర్ షిహాన్ సలాంబిన్ ఉమర్, ఉపాధ్యాయులు స్వాతి, అంజన్ ప్రసాద్, అంబ్రేష్, మహ్మద్ సలీం తదితరులు పాల్గొన్నారు.

రాహుల్ గాంధీ వ్యాఖ్యలు బాధ్యతా రాహిత్యం

నారాయణపేట: నాటి నుంచి నేటి వరకు కాంగ్రెస్ విభజించి పాలించడం ఆ పార్టీ డీఎన్‌ఏలో ఉందని పార్లమెంట్‌లో విపక్షనేత రాహుల్ గాంధీ మాటలు నిజం చేస్తున్నాయని బీజేపీ రాష్ట్ర సీనియర్ నేత నాగురావు నామాజీ మంగళవారం ఒక ప్రకటనలో మండిపడ్డారు. రాహుల్ గాంధీ పార్లమెంట్‌లో చేసిన ప్రసంగంతో యావత్ దేశ ప్రజలు తలదించుకుంటున్నారన్నారు. ఆర్‌ఎస్‌ఎస్‌పై, హిందువులపై చేసిన వ్యాఖ్యలు బాధ్యత రాహిత్యానికి నిదర్శనమన్నారు. గతం నుంచి విభజన రాజకీయాలు చేస్తూ మారణహోమంలో కాంగ్రెస్ చలి మంటలు కాచుకుందని విమర్శించారు.

క్రీడా పాఠశాలకు ఎంపిక

మక్తల్: తెలంగాణ క్రీడా పాఠశాలకు నాలుగో తరగతి ప్రవేశం కోసం మండలంలోని ప్రభుత్వ పాఠశాలనుంచి 15మంది విద్యార్థులు ఎంపికైనట్లు విశ్రాంతి పీఈటీ గోపాలం మంగళవారం తెలిపారు. ఈ నెల 11, 12 తేదీలో హైదరాబాద్‌లోని హకీంపెటలో జరిగే ఎంపికలో క్రీడా పోటీలో పాల్గొంటారని, వారు సర్టిఫికెట్లతో 11న ఉదయం 7గంటలకు హకీంపెట క్రీడా పాఠశాలలో రిపోర్టు చేయాలని కోరారు. మేష్‌కుమార్, అంబ్రేష్ పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

మద్దూరు: మండల సీనియర్ జర్నలిస్టు బస్వరాజ్‌కు మంగళవారం మండల జర్నలిస్టులు ఆర్థిక సహాయం అందజేశారు. ఇటీవలే రోడ్డు ప్రమాదంలో కాలికి గాయం కావడంతో నడవలేని పరిస్థితి నెలకొంది. వైద్య ఖర్చుకోసం మండల జర్నలిస్టులందరు కలిసి రూ.15 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. అంజయ్య, బలరాం, విజయ్, షఫీ పాల్గొన్నారు.

అరకొర వసతులు.. తప్పని అవస్థలు

- ప్రభుత్వ బడుల్లో వేధిస్తున్న సౌకర్యాల కొరత
- వరండాలు, స్లాబ్‌ల కింద, శిథిలావస్థలో ఉన్న గదుల్లో బోధన
- పట్టించుకోని అధికారులు



ఊర్దూ మీడియం పాఠశాల వరండాలో ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు తరగతులు

మద్దూరు: 'ప్రభుత్వ పాఠశాలల్లో శిక్షణ పొందిన ఉపాధ్యాయులచే బోధన. విద్యార్థులకు మధ్యాహ్న భోజనం. అన్ని మౌలిక వసతులకూడిన డిజిటల్ తరగతి గదులు. విద్యార్థులకు సరిపడా మూత్రశాలలు, మరుగుదొడ్లు, ఆటస్థలం, కార్పొరేట్ స్థాయిలో విద్యాబోధన. ఉచిత పాఠ్య, నోటు పుస్తకాలు. ఉచిత ఏకరూప దుస్తులు, ఇన్ని సౌకర్యాలు కల్పిస్తున్నాం. మీ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పండి.' అంటూ ప్రభుత్వం బడి బాట కార్యక్రమం చేపట్టింది. దీనికి తోడు సీఎం సొంత నియోజకవర్గంలోని పాఠశాలలను రాష్ట్రానికే ఆదర్శంగా తీర్చిదిద్దుతామని కలెక్టర్ హామీ ఇచ్చారు. కానీ వీటిలో చాలావరకు హామీలు ఉత్తి మాటలుగానే మిగిలిపోతున్నాయి. మద్దూరు మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో పై చెప్పిన వసతుల్లో చాలావరకు కనిపించడం లేదు. వరండాలు, స్లాబ్‌ల కింద అరకొర వసతుల మధ్య విద్యార్థులు పాఠాలు వినాల్సిన దుస్థితి నెలకొంది.

నిలిచిన పనులు

మద్దూరు బాలికల ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాల తరగతి గదులు శిథిలావస్థకు చేరడంతో అప్పటి ప్రభుత్వం మన ఊరు– మన బడి కింద చర్యలు చేపట్టింది. రెండు పాఠశాలల్లో తరగతి గదుల నిర్మాణం కోసం గతేడాది జూన్‌లో పనులు ప్రారంభించారు. ఉన్న తరగతి గదులను కూల్చివేసి ఉన్నత పాఠశాలలో మూడు తరగతి గదులు, ఒక డైనింగ్ హాల్, ఇతర మరమ్మతుకు రూ.84 లక్షలు మంజూరు చేశారు. స్లాబు వేశారు. రూ.26 లక్షల బిల్లులను అధికారులు చేశారు. కానీ బిల్లులు రాకపోవడంతో ఆరు నెలలుగా తరగతి గదుల నిర్మాణం చేపట్టలేదు. దీంతో పాఠశాలలోని 320 మంది విద్యార్థులు అవస్థలు పడాల్సి వస్తోంది.



మద్దూరు బాలికల ఉన్నత పాఠశాలలోని పదోతరగతి విద్యార్థుల గది



స్లాబ్ కింద కొనసాగుతున్న 6, 7 తరగతులు

సరైన తరగతి గది లేకపోవడంతో తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. 10, 9వ తరగతుల వారికి శిథిలావస్థలో ఉన్న తరగతి గదుల్లో పాఠాలు బోధిస్తున్నారు. 6, 7 తరగతుల వారికి స్లాబ్ కిందనే పాఠాలు బోధిస్తున్నారు. బాలికల పాఠశాలలో కనీసం మూత్ర శాలలు కూడా లేవు. దీంతో గతేడాది దాదాపు 400 మంది వరకు విద్యార్థులు ఉండగా ప్రస్తుతం అడ్మిషన్లు పూర్తిగా తగ్గిపోయాయి.

కనీస వసతులు కూడా లేవు



మా తరగతిలో 92 మంది విద్యార్థులం ఉన్నాం. ఇంత మంది కూర్చోడానికి తరగతి గదిలో స్థలం లేదు. కనీసం వెలుతురు కూడా గదిలోకి రాదు, దీనికి తోడు శిథిలావస్థలో ఉంది. మూత్రశాలలు కూడా లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి నెలకొంది. తరగతి గదులు నిర్మాణం వెంటనే పూర్తి చేస్తే తప్ప మా చదువులు సాగేలా లేవు.

– అపర్ణ, పదోతరగతి విద్యార్థి, బాలిక ఉన్నత పాఠశాల, మద్దూరు

అధికారులకు నివేదిక అందించాం



మన ఊరు– మన బడి కార్యక్రమం కింద మంజూరైన తరగతి గదుల నిర్మాణం పనులు చేపట్టారు. బిల్లుల కోసం రాష్ట్ర స్థాయి అధికారులకు పూర్తి నివేదిక అందజేశాం. ఈ రెండు పాఠశాలలే కాదు. జిల్లాలో చాలా పాఠశాలలకు నిధులు మంజూరు కావాల్సి ఉంది. ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు రాలేదు. వచ్చిన వెంటనే తెలియజేస్తాం.

– శ్రీనివాస్, సెక్టోరల్ అధికారి, నారాయణపేట

ఉర్దు మీడియం బడిలో.. ప్రాథమిక పాఠశాల

శిథిలావస్థలో ఉన్న నిజాం కాలం నాటి భవనాలను తొలగించి మన ఊరు– మన బడి కింద 5 తరగతి గదుల నిర్మాణం కోసం రూ.63 లక్షలు మంజూరు చేసి పనులు ప్రారంభించారు. దాదాపు రూ.10 లక్షలు మాత్రమే బిల్లులు రావడంతో పనులు నిలిచిపోయాయి. ఏడాది క్రితం పనులు ప్రారంభించడంతో ప్రాథమిక పాఠశాలను గతేడాది ప్రైవేటు భవనంలో కొంత కాలం నిర్వహించారు. అక్కడా సరైన వసతులు లేకపోవడం, వర్షం వస్తే తరగతి గదుల్లోకి నీళ్లు రావడంతో కొంతకాలానికి ఉర్దూ మీడియం పాఠశాలకు బదిలీ చేశారు. అక్కడున్న ఊర్దూ మీడియం విద్యార్థులకే తరగతి గదులు సరిపోవడం లేదు. దీనికి తోడు 139 మంది విద్యార్థులుండే ఈ ప్రాథమిక పాఠశాలను అక్కడికి మార్చడంతో ఒకే చోట మూడు తరగతులను నిర్వహణ చేపట్టారు. దీంతో వీరి చదువులు సాగడం అటు ఉంచితే అసలు విద్యార్థులను పాఠశాలకు పంపడానికే తల్లిదండ్రులు మొగ్గు చూపడం లేదు. దీంతో ఈ పాఠశాలలో గతంలో 250 మంది విద్యార్థులుంటే ప్రస్తుతం ఆ సంఖ్య 119 మందికి పరిమితమైంది.

డీఐఈఓకు సన్మానం



నారాయణపేట రూరల్: జిల్లా నూతన నోడల్ అధికారి (డీఐఈఓ)గా బాధ్యతలు చేపట్టిన హెచ్ సుదర్శన్‌రావును మంగళవారం ప్రిన్సిపాల్స్, లెక్చరర్లు కలుసుకుని అభినందించారు. ఈ సందర్భంగా శాలువాతో సన్మానించారు. జిల్లాలో ఇంటర్ ఫలితాల్లో ముందడుగు వేసేందుకు కలిసి పనిచేస్తామని హామి ఇచ్చారు. కార్యక్రమంలో లెక్చరర్లు కృష్ణ, రషీద్, వెంకట్రాములు, హన్మంతు, శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు.

పదవి విరమణ పొందిన టీచర్‌కు సన్మానం



మక్తల్: పట్టణంలో ప్రభుత్వ జెడ్పీ ఉన్నత బాలుర పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పని చేస్తున్న అరుణ మంగళవారం పదవి విరమణ పొందుతున్న సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆమె శాలువాతో ఘనంగా సన్మానం చేశారు. అనంతరం పలువురు వక్తలు మాట్లాడుతూ.. సమాజంలో పని చేసేవారికి గుర్తింపు ఉంటుందన్నారు. విద్యార్థులకు ఆమె చేసిన సేవలను కొనియాడారు. పాఠశాల ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నిషేధిత గుట్కాల పట్టివేత

మద్దూరు: పట్టణంలో చింతలకుంట విష్ణుకు చెందిన కిరాణంలో అక్రమంగా ప్రభుత్వం నిషేధించిన గుట్కా ప్యాకెట్లను నిల్వ ఉంచి ప్రజలకు అమ్ముతున్నారని నమ్మదగిన సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ పోలీసులు సంయుక్తంగా మంగళవారం దాడులు నిర్వహించారు. రూ.1,625 విలువచేసే గుట్కాలను పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. విష్ణుపై కేసునమోదు చేసినట్లు ఎస్‌ఐ రాంలాల్ తెలిపారు.

సాదాసీదాగా మండల సర్వసభ్య సమావేశం

కృష్ణా: సర్వసభ్య సమావేశం ఇదే చివరిది కావడంతో ఎంపీటీసీ, ఎంపీపీ, జెడ్పీటీసీ సభ్యులను మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. అంతకుముందు ఎంపీపీ పూర్ణిమ వెంకట్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సర్వసభ్య సమావేశానికి జెడ్పీటీసీ సభ్యురాలు అంజనమ్మపాటీల్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అనంతరం రెవెన్యూ, విద్యుత్ శాఖ, ఉపాధిహామీ, వైద్యశాఖలకు చెందిన అధికారులు వారి వారి ప్రగతి నివేదికలను సభకు వివరించారు. అనంతరం గౌరవ సభ్యులను ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది వారిని సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జానయ్య, తహసీల్దార్ దయాకర్‌రెడ్డి, వైఎస్ ఎంపీపీ ఈశ్వరప్పగౌడ, జెడ్పీటీసీ సభ్యురాలు అంజనమ్మ, ఎంపీటీసీ సభ్యులు లక్ష్మీనారాయణ, రాంచందర్, ఏఈ ధర్మతేజ, ఏఓ సుదర్శన్‌గౌడ్, ఏపీఓ యాదవ రాజ్, ఏపీఎం బస్వరాజ్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



జెడ్పీటీసీ అంజనమ్మను సన్మానిస్తున్న అధికారులు

నిరుద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



పేటలో తహసీల్దార్ రాణప్రతాప్‌కు వినతిపత్రం అందిస్తున్న నాయకులు



నర్వలో తహసీల్దార్ మల్లారెడ్డికి వినతిపత్రాన్ని అందిస్తున్న నాయకులు

నారాయణపేట: నీళ్లు, నిధులు, నియామకాలు అంటూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డ నాటి నుంచి నేటివరకు నియామకాల విషయంలో నిరుద్యోగులు మోసానికి గురవుతున్నారని బీజేవైఎం నాయకులు పలువురు ఆరోపించారు. మంగళవారం నిరుద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ తహసీల్దార్‌కు రాణప్రతాప్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. నిరుద్యోగుల తరపున గత కొన్ని సంవత్సరాలుగా బీజేవైఎం పోరాటాలు చేస్తూనే ఉందని, అయినప్పటికీ ఈ నియంతృత్వ ప్రభుత్వం కనీస స్పందన లేకుండా కాలం గడిపేస్తుందని, నిరుద్యోగులపై నిర్లక్ష్యం వహిస్తుందని వినతిపత్రంలో పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ యువమోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు మోహన్, నాయకులు ప్రకాష్, చేతన్, అంజి, బీజేవైఎం కార్యకర్తలు పాల్గొన్నారు.

నర్వ: గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం మాదిరిగానే కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగుల సమస్యలను పరిష్కరించడంలో పూర్తిగా విఫలమైందని బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు రవికుమార్‌రెడ్డి అన్నారు. నీళ్లు నిధులు, నియామకాలు అంటూ గద్దెనెక్కిన గత ప్రభుత్వం మొండిచెయ్యి చూపించిందన్నారు. గ్రూప్–2 గ్రూప్–3 నోటిఫికేషన్‌లలో అదనంగా పోస్టులను పెంచాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ మల్లారెడ్డికి సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందించారు. వావిళ్ల రవికుమార్‌రెడ్డి, నరేష్‌శెట్టి, విజయ్‌రాం, అయ్యప్పస్వామి, శ్రీను, చంద్రకాంత్, అశోక్, మల్లేష్‌యాదవ్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

అధునాతన పద్ధతులు అవలంబిస్తే అధిక దిగుబడులు

కోస్గి: వ్యవసాయ రంగంలో రైతులు నేటికి మూస పద్ధతులు అవలంభించి నష్ట పోతుంటారని, వ్యవసాయ శాఖ అధికారుల సూచనలు, సలహాలు పాటిస్తూ అధునాతన పద్ధతులు అవలంభిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చునని ఏఓ రామకృష్ణ సూచించారు. ఈ మేరకు మంగళవారం మండల పరిధిలోని కడంపల్లి, ముంగిమళ్ల గ్రామాల్లో పంట పొలాల్ని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రైతులు కూరగాయలు, పూలసాగు వంటి వాణిజ్య పంటలను సాగుచేసి ఆర్థిక లబ్ధి పొందాలన్నారు. అనంతరం పంటల్లో చీడపీడల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సస్యరక్షణ చర్యలను వివరించారు. కార్యక్రమంలో ఏఈఓలు తిరుపతి, నరేందర్‌తోపాటు ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు

ప్రజలకు ఇబ్బంది లేకుండా పనిచేయాలి

మక్తల్: గ్రామాల్లో ప్రజలకు ఇబ్బందులు లేకుండా అధికారులు సమన్వయంతో పని చేయాలని ఎంపీపీ వనజ అన్నారు. మంగళవారం మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ వనజ అధ్యక్షతన నిర్వహించారు. ఈ మేరకు.. విద్యుత్ శాఖ అధికారులు నివేదిక చదివే సమయంలో ఎంపీటీసీ బాల్ రాంరెడ్డి మాట్లాడుతూ.. విద్యుత్ తీగలు పాఠశాలలపై వేలాడుతున్నాయని, వాటిని తొలగించాలని కోరారు. అధికారులు ఎవరు రాకపోవడంతో కింది స్థాయికి చెందిన అదికారులను పంపిస్తే పనులు ఎవరూ చేయరని ఎంపీటీసీ బాల్‌రాంరెడ్డి, అశిరెడ్డి అరోపించారు. గ్రామాల్లో చేసిన ఉపాధి పనుల నివేదికను వివరించారు. కూలీలకు రూ. 272 నుంచి 300 వరకు కూలీ పెంచడం జరిగిందన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారి మాట్లాడుతూ గ్రామాల్లో తాగునీటి కొరత లేకుండా చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఇరిగేషన్ అధికారులు మాట్లాడుతూ కాల్వలో రిజర్వాయర్ల నుంచి నీటిని వదిలేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం వివిధ శాఖలపై చర్చించారు. గ్రామాల్లో సమస్యలు ఎమైన తన దృష్టికి తీసుకోని రావాలని అధికారులకు ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ గోవిందు రావు, తహసీల్దార్ సువర్ణరాజు, వైస్ ఎంపీపీ రామేశ్వరి, ఎంపీటీసీ సభ్యులు రంగప్ప, పద్మ, ఇందిరమ్మ, రంగప్ప, వెంకటయ్య, ఎంపీఓ రహిమాత్, సూపర్‌వైజర్లు రాజేశ్వరి, మల్లేశ్వరి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీపీ వనజ

నేడు కలెక్టరేట్ ఎదుట ధర్నా

మాగనూర్: ప్రభుత్వం అసెంబ్లీ ఎన్నికల్లో ఆసరా పెన్షన్స్ పెంచుతామని ఇచ్చిన హామని వెంటనే అమలు చేయాలని రూ. 6 వేలు ఇవ్వాలని ఎన్పీఆర్డీ మండల అధ్యక్షుడు బాబు డిమాండ్ చేశారు. ఆయన మాట్లాడుతూ.. దివ్యాంగుల పెన్షన్ పెంచాలని డిమాండ్ చేస్తు జులై 3న కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా కార్యక్రమం ఉంటుందన్నారు. పెన్షన్లకు కేంద్ర ప్రభుత్వం వాటా 2011నుంచి కేవలం రూ. 300 ఇస్తుందని అన్నారు. కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన దివ్యాంగులకు ఉచిత బస్‌సౌకర్యం, బ్యాక్ లాగ్ పోస్టుల భర్తీ చేయాలని కోరారు. కాలపరిమితి ముగిసిన సదరం సర్టిఫికెట్స్ వెంటనే రెన్యూవల్ చేయాలన్నారు. బుధవారం జరిగే కలెక్టర్ కార్యాలయాల ముట్టడిలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు

మక్తల్: బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బి.కొండయ్య జన్మదిన వేడుకలు మంగళవారం పట్టణంలోని ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు.. పడమటి శ్రీ ఆంజనేయస్వామి ఆలయంలో ఆయన ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం కేక్‌కట్ చేసి నాయకులకు పంచిపెట్టారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బంగ్లా లక్ష్మికాంత్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి భాస్కర్, మున్సిపాల్ వైస్ చైర్మన్ అఖిలరెడ్డి, బీజేపీ మండల అధ్యక్షుడు లక్ష్మన్, ఎంపీటీసీ బాల్‌రాంరెడ్డి, ఎంపీటీసీ రంగప్ప, బీజేపీ జిల్లా కార్యదర్శి కల్లూరి నాగప్ప, కర్నిస్వామి, లక్ష్మణ్ పాల్గొన్నారు.

ఎంపీటీసీల సేవలు మరువలేనివి



ధన్వాడ: ఎంపీటీసీలుగా గెలిపించి ప్రజలకు సేవ చేసేందుకు అవకాశం ఇవ్వడం తమ అదృష్టమని ఎంపీపీ పద్మిబాయి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో జెడ్పీటీసీ, ఎంపీపీ, ఎంపీటీసీలు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ మేరకు.. వారికి మాజీ సర్పంచ్‌లు సన్మానం చేశారు. మాట్లాడుతూ.. గ్రామ అభివృద్ధి కోసం కృషి చేసామని ఇందుకు సహకరించి ప్రతి ఒక్క అధికారి, సర్పంచ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. తహసీల్దార్ సింధుజా, ఎంపీడీఓ సాయి ప్రకాష్, ఎంపీఓ వెంకటేశ్వర్లు, ఏఈ ప్రవీణ్, మాదవరెడ్డి, సచిన్, సురేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

'తీరిన తాగునీటి సమస్య'

అమరచింత: మదనాపురం మండలంలోని రామన్‌పాడ్ జలాశయం సమీపంలోని ఎర్రగట్టు వద్ద ఏర్పాటు చేసిన ఎర్రగట్టు మిషన్ భగీరథ పంప్‌హౌజ్‌కు విద్యుత్ సరఫరా పునరుద్దరించడంతో ఆయా గ్రామాలకు తాగునీటి సరఫరా కొనసాగింది. వీటితో పాటు అమరచింత పట్టణంలో విద్యుత్ సమస్యతో సోర్స్‌బోర్లు సైతం పనిచేయకపోవడం తాగునీటి సరఫరా నిలిచిపోయింది. దీంతో మిషన్ భగీరథ ఏఈ రామకృష్ణ ఎర్రగట్టు పంప్‌హౌజ్‌కు సోమవారం రాత్రి నుంచే విద్యుత్ సరఫరా జరిగేలా ట్రాన్స్‌కో అధికారులతో మాట్లాడటంతో తాగునీటి పంపింగ్ కొనసాగింది. అమరచింత, ఆత్మకూర్, మదనాపురం, చిన్నచింతకుంట మండలాల్లోని సుమారు 26 గ్రామాలకు మంగళవారం తాగునీరు అందించారు. అమరచింత మున్సిపల్ కమిషనర్ నురుల్‌నదీం ఆదేశాలతో మున్సిపల్ ఎలక్ట్రిషన్ సిబ్బంది సోర్సుబోర్లకు త్రీఫేజ్ కరెంట్ పునరుద్ధరించడంతో పట్టణంలోని 1, 8 వార్డుల ప్రజలకు తాగునీటి కష్టాలు తప్పాయి.

మొక్కలు నాటేందుకు ముందుకు రావాలి



ఊట్కూర్‌లో మొక్కలు నాటుతున్న అధికారులు



గార్లపహాడ్‌లో ..

ఊట్కూరు: ఇంటింటికీ మొక్కలు నాటి పచ్చదనాన్ని పరిరక్షించాలని ఎంపీడీఓ ధనుంజయగౌడ్ అన్నారు. మంగళవారం మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఈ మేరకు.. ఎంపీడీఓ మాట్లాడుతూ వర్షాకాలం ప్రారంభమైందని ఇంటి పరిసరాలలో, రోడ్ల పక్కన, ఖాళీ స్థలాల్లో మొక్కలు నాటాలని అన్నారు. ప్రతి గ్రామంలో నర్సరీలో పదివేల మొక్కలను పెంచడం జరిగిందని ఆయన తెలిపారు. టేకు, కానుగ, పండ్ల మొక్కలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో ఏపీఓ సత్యప్రకాష్, కార్యదర్శి శ్రీనివాస్, మైపాల్‌రెడ్డి, భీమేష్, ఉదయ్‌కుమార్ పాల్గొన్నారు.

కోయిల్‌కొండ: గ్రామాల్లో మొక్కలను నాటేందుకు ప్రతిఒక్కరు ముందుకు రావాలని అడిషనల్ డీఆర్‌డీఓ ముసాయిదాబేగం అన్నారు. మంగళవారం గార్లపహాడ్, అభంగపట్నం గ్రామాల్లో నర్సరీలను పరిశీలించారు. అనంతరం అభంగపట్నం గ్రామ పంచాయతీలో ఉపాధిహామీ పనుల రికార్డులను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ మొక్కలను పెట్టడమే కాకుండా వాటిని సంరక్షించే బాధ్యత కూడా ప్రతిఒక్కరు తీసుకోవాలన్నారు. మొక్కలను నాటడం ద్వారా అనేక లాభాలు ఉన్నాయన్నారు. అదేవిధంగా గ్రామాల్లో జరుగుతున్న ఉపాధిహామీ పనులు సక్రమంగా నిర్వహించాలన్నారు. అడిగిన ప్రతి కూలీకి పనికల్పించేందుకు ఉపాధిహామీ అధికారులు కృషి చేయాలన్నారు. ఏపీఓ నర్సయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

పోలేరమ్మ తల్లి బయలెల్లినాదే..



పోలేరమ్మకు బోనంతో వెళ్తున్న మహిళలు

నర్వ: తల్లి బయలెల్లినాదే.. పోలేరమ్మ తల్లి బయలెల్లినాదే.. అంటు మహిళలు నెత్తిన బోనం పెట్టుకుని అమ్మవారిని దర్శించుకున్నారు. మంగళవారం నర్వ, పాథర్చేడ్ గ్రామాల్లో పోలేరమ్మ బోనాల పండగను ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా భక్తులు పోలేరమ్మకు ఉదయం అంబలి నైవేద్యాలను డోలు వాయిద్యాలతో ఊరేగింపుగా వెళ్లి సమర్పించారు. అనంతరం మేకలు, గొర్రెలు, కోళ్ల ను అమ్మవారికి బలి ఇచ్చారు. ఆయా గ్రామాల గ్రా మ పెద్దలు అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు.

రైతు భరోసాపై అభిప్రాయ సేకరణ

మాగనూర్: రైతుల అభిప్రాయాలకు అనుగుణంగా ప్రభుత్వం రైతు భరోసా అందించేందుకు ఏర్పాట్లు చేస్తుందని ఏడీఏ నాగేష్ అన్నారు. రైతుల అభిప్రాయ సేకరణలో భాగంగా మండల కేంద్రంలోని రైతువేదికలో మంగళవారం పీఏసీఎస్ ఆధ్వర్యంలో జనరల్ బాడీ మీటింగ్ నిర్వహించారు. ఈ మేరకు.. ఆయన మాట్లాడుతూ.. రైతు భరోసా పథకానికి సంబంధించి రైతుల అభిప్రాయాలు సేకరించి రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక అందించనున్నట్లు తెలిపారు. దీనిపై చర్చించి విధివిధానాలపై ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందన్నారు. పలువురు డైరెక్టర్లు తమ అభిప్రాయా లు తెలుపగా, తీర్మానం తయారుచేసి పంపించారు. ప్రభుత్వం రైతుభరోసా కింద ఎకరానికి రూ. 15వేలు చెల్లించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ వెంకట్‌రెడ్డి, సీఈఓ గోవర్ధన్‌గౌడ్, ఏఈఓ, సింగిల్ విండో డైరెక్టర్‌లు తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూర్: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రైతుభరోసా పథకంపై రైతులతో అభిప్రాయాలను సేకరిస్తున్నామని పీఏసీఎస్ అధ్యక్షుడు గాడి కృష్ణమూర్తి, జిల్లా డీసీఓ సీనియర్ అసిస్టెంట్ కురుమూర్తి, అసిస్టెంట్ రిజిస్ట్రర్ నరేందర్ అన్నారు. మంగళవారం స్థానిక పీఏసీఎస్ కార్యాలయంలో డైరెక్టర్లు, రైతులతో సమావేశమయ్యారు. ఈసందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ ఇది వరకు చాలా మంది గ్రామకంఠం, నాన్‌అగ్రికల్చర్, రోడ్లు, సాగులేని గుట్టలు, ప్రభుత్వ భూములు, ప్రభుత్వ ఉద్యోగులు, ఎన్‌ఆర్‌ఐలు, ప్రభుత్వానికి పన్నులు చెల్లించేవారు, ప్రజాప్రతినిధులు కూడా రైతుబంధు తీసుకున్నారని దుయ్యబట్టారు. అలాంటి వారికి కాకుండా శిస్తు చేసే రైతులకు మాత్రమే రైతు భరోసా ఇవ్వాలని పలువురు రైతులు సూచించారు. రైతుల అభిప్రయాలను ఉన్నతాధికారులకు నివేదిస్తామన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి వినయ్‌కుమార్, ఏఈఓ మహేశ్వరి, సీఈఓ నరేష్, అధికారులు మాసన్న, సురేష్, డైరక్టర్లు సహదేవుడు, తమ్మిరెడ్డి, రాములు, రైతులు పాల్గొన్నారు.



మాగనూర్‌లో మాట్లాడుతున్న ఏడీఏ నాగేష్



ఆత్మకూర్‌లో మాట్లాడుతున్న విండో అధ్యక్షుడు కృష్ణమూర్తి